# మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత





**చాట్రాయి,మేజర్‌న్యూస్ :** చాట్రాయి మండలంలోని కోటపాడు ఎంపి.యు.పి పాఠశాలలో బుధవారం కొంతమంది విద్యార్థులకు పగలు వాంతులు అవటంతో చాట్రాయి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ విజయలక్ష్మి విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించారు.కానీ గురువారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మజ్జిగ తీసుకున్న వెంటనే కొంతమంది విద్యార్థులకు. కడుపులో నొప్పి రావడంతో నూజివీడు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కు.తరలించి మెరుగైన వైద్యం అందించడంతో విద్యార్థులు కోలుకొన్నారని మండల విద్యాశాఖ అధికారి వి.బ్రహ్మాచారి పేర్కొన్నారు.


నేటి దినపత్రిక

18వ

# సూర్య

www.suryaa.com

## ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

శుక్రవారం,13 డిసెంబర్ 2024 8 పేజీలు


# రెండవ రోజు జిల్లా కలెక్టర్ల సమావేశంలో

## మంత్రి పార్ధసారధి,వెట్రి సెల్వి,చదలవాడ నాగరాణి






**అమరావతి/ఏలూరు/భీమవరం,మేజర్‌న్యూస్ :** రెండవ రోజు జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రి పార్ధసారధి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి,పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. కలెక్టర్ల సదస్సులో ఏలూరు జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై సంబంధిత శాఖల వారీగా సమగ్ర నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రభుత్వానికి అందజేశారు. ఇందులో భాగంగా జిల్లా అభివృద్ధికి యంత్రాంగం రూపొందించిన విజన్-2047 ప్రణాళికను కూడా అందజేశారు. రాష్ట్రస్థాయి విజన్‌ప్లాన్‌ను ఈనెల 13న రాష్ట్రప్రభుత్వం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విడుదల చేయనున్నారు. అందులో భాగంగా జిల్లా, మండలస్థాయి ప్రణాళికలను తయారు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అన్ని జిల్లాలు, మండలాల్లో వాటిని రూపొందించారు. రెండో రోజు కలెక్టర్ల సదస్సులో పరిశ్రమలు, ఐటీ పార్కులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్. ఉద్యోగాల కల్పన చాలా ప్రధానమైన అంశం వచ్చే సమావేశానికి ఒక్కో జిల్లాలో ఎన్ని ఉద్యోగాలు కల్పించామనే వివరాలతో రావాలి నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలి రైతులను భాగస్వాములను చేయండి. అంతిమ లబ్దిదారులుగా వారుండేలా ప్రోత్సహించాలి పరిశ్రమలకు అనుమతులిచ్చే విషయంలో అసలత్వం తగదు. గతంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే పారిశ్రామికవేత్తలు భయపడ్డారు. ఇప్పుడు ఆ పరిస్థితి పోగొట్టి మళ్లీ అనుకూల వాతావరణం కల్పించాలని కలెక్టర్లకు సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

# వైఎస్ఆర్సీపీకి మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గుడ్‌బై

### - ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వైఎస్ఆర్సీపీనీ వీడి రాజకీయాలకు దూరం కావాలని నిర్ణయం తీసు కున్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేక రులకు అందజేశారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి రాజీనామాలేఖ పంపారు. 2011లో వైఎస్ జగన్‌తో ప్రారంభమైన ఆయన రాజకీయ అను బంధం 2024ఎన్నికల ఓటమితో ముగిసింది.ఈసందర్భంగా పార్టీకి, భీమవరం నియోజకవర్గబాధ్యతలకుఆయనరాజీనామా ప్రకటించారు.

**ప్రారంభం నుంచి ప్రస్తుతం వరకు -** 2011లో వైఎస్ జగన్ భీమవరం పర్యటనలో గ్రంధి శ్రీనివాస్‌ను ప్రజా సమక్షంలో పార్టీలో చేర్చుకున్నారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడి పోయారు. ఆ తరువాత 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను ఓడించి గ్రంధి శ్రీనివాస్ చరిత్ర సృష్టించారు.

**రాజీనామాకు కారణాలు** -2024 ఎన్నికల్లో

- తరువాయి 2లో..

# నేటి నుండి జిల్లాలో రెవిన్యూ సదస్సులు

### - ప్రజలకు సేవలు అందించే భాధ్యత మనపై ఉంది



**భీమవరం,మేజర్‌న్యూస్ :** ఈ నెల 13వ తేదీ శుక్రవారం నుండి జనవరి 8వ తేదీ వరకు నిర్వహిం చనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు శుక్రవారం నుండి జిల్లాలోని 20 మండలాల్లోని 320 రెవెన్యూ గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగు తుందన్నారు. భీమవరం డివిజన్‌లో 119, నరసాపురం డివిజన్‌లో 111, తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో 90 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిలో డివిజన్ల వారీగా భీమవరం 6,నరసాపురం 12,తాడేపల్లిగూడెం 7రెవెన్యు గ్రామాలలో రేపు సదస్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులలో అర్జీదారుని గౌరవించి, ఆప్యాయంగా పలకరించి అర్జీని స్వీకరించడం జరుగు తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఒక చక్కటి అవకాశమన్నారు.

- తరువాయి 2లో..

# ప్రకృతి విపత్తుల నిధులు పక్కదారి పట్టించిన వైసిపి ప్రభుత్వం

### - పార్లమెంటు సాక్షిగా వైసిపి ఎంపీలకు ధీటైన సమాధానం చెప్పిన ఎంపీ మహేష్



**దిల్లీ/ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ప్రజలను ఆదుకోవడంలో గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అలాగే నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆరోపించారు. విపత్తు నిర్వహణ సవరణ బిల్లు 2024 ఆమోదం సందర్భంగా గురువారం లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం బుడమేరు అభివృద్ధిని విస్మరించడం వల్లే సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు విజయవాడ మునిగిపోయిందని ఎంపీ ప్రస్తావించారు. విజయవాడ వరదల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధితులకు అండగా నిలిచారని, తమ కూటమి ప్రభుత్వం తక్షణం సహాయక చర్యలు చేపట్టడమే కాకుండా, సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షించారని, బాధితులకు పరిహారం అందించిన తర్వాతే చంద్రబాబు ఇంటికివెళ్లారని,రెండు వారాల పాటు దగ్గరుండి చంద్రబాబు పర్యవేక్షించారని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. వైఎస్ఆర్సిపి ప్రజా ప్రతినిధులు మాత్రం తమ ప్రభుత్వంపై బురదజల్లే విధంగా లోక్ సభలో మాట్లాడి సభను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుడమేరు

- తరువాయి 2లో..

# జిల్లా కలెక్టర్ల సదస్సుకు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



**అమరావతి/ఏలూరు,మేజర్‌న్యూస్:** అమరావతిలో గత రెండు రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సు కార్యక్రమంలో గురువారం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పాటు ఎస్పీ పాల్గొన్నారు.

# గ్రేస్ మందిర్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరు క్రీస్తు చూపిన మార్గంలో పయనిస్తూ సమాజ సేవ చేయాలని పాస్టర్ హెబ్రా శాస్త్రి పిలుపునిచ్చారు. బుధవారం జీలుగుమిల్లిలోని రైస్ మిల్ ఆవరణలో గ్రేస్ మందర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్తు దీపపు కాంతులు, బాణా సంచా వెలుగు, శబ్దాలతో కనీవినీ ఎరుగని రీతిలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలలో భాగంగా సండే స్కూల్ చిన్నారులతో నృత్యాలు, గ్రేస్ మందిర్ యువతీ యువకుల క్రీస్తు పాటలను ఆలపించడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. యువకులంతా చక్కటి ఏకరూప దుస్తులు ధరించడం చక్కటి క్రమశిక్షణ కలిగి ఉండటం ఆహ్వానం మేరకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరించడం వారికి కేటాయించిన సీట్లు కూర్చోబెట్టడం వంటి అనేక పనులు చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రేస్ మందిరిలో క్రీస్తు బోధనలతో పాటు క్రమశిక్షణకు మారుపేరుగా యువతి యువకులు పెద్దలు ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ వర్తమానికులు రెవరెండ్ డాక్టర్ డేవిడ్ బెన్ హెూమ్ ప్రసంగం అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. ఏసుక్రీస్తు చూపిన మార్గం మానవాళికి ఎంతో విశ్వాసపాత్రమైనదని పాస్టర్ హెబ్రా శాస్త్రి అన్నారు. క్రీస్తు నేడు పుట్టెను హల్లెలూయ అంటూ క్రైస్తవులు నినాదాలు చేయడం ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్స్ వారి వారి సందేశాలను ఎంతో నిమ్రతతో ప్రసంగించారు.

కార్యక్రమం ఆద్యాంతం తిలకించిన గ్రామస్తులు ఎంతో ఆనందాన్ని పొందినట్లు పేర్కొన్నారు. మతాలకతీతంగా కార్యక్రమాన్ని తిలకించినట్లు పలువురు తెలిపారు.

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**29న జరిగే ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం,మేజర్‌న్యూస్:** ఈనెల 29వ తేదీన భీమవరం బ్యాంక్ కాలనీలోని కొపా కళ్యాణ మండపంలో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హైదారాబాద్ కాంటినెంటల్ హాస్పటల్ వారి ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్ ను ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కోపా అధ్యక్షులు యర్రంశెట్టి హరినాథ్ హైదారాబాద్ కాంటినెంటల్ హాస్పటల్ అసిస్టెంట్ మేనేజర్ కొల్లి సోమేశ్వరరావు మాట్లాడుతూ హైదారాబాద్ నుంచి ప్రముఖ కార్డియాలజీ, అంకాలజీ, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులు భీమవరంలో జరిగే ఉచిత మెగా వైద్య శిబిరానికి వస్తున్నారని, అన్ని రకాల పరీక్షలను ఉచితంగా చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను కూడా అందిస్తారని, ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డా చందు కృష్ణతేజ, గోపిశెట్టి మురళీకృష్ణ, అరేటీ సత్యనారాయణ, టీడీపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వర్రావు, పొత్తూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధే ప్రగతికి సోపానాలు : ఎంపీడీవో వై రామకృష్ణ





**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** సుస్థిర అభివృద్ధే ప్రగతికి సోపానాలని ఎంపీడీవో వై రామకృష్ణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యం పై అధికారులకు , ప్రజా ప్రతినిధులకు శిక్షణాతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ వై శ్యాంసుందర్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి సుస్థిరంగా ఉండాలంటే గ్రామీణ అభివృద్ధికి వచ్చే నిధులు సక్రమంగా వినియోగించాలన్నారు. పేదరిక నిర్మూలనపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యం ,ఆరోగ్యవంతమైన పంచాయితీలను నిర్మించుకోవాలన్నారు. స్వచ్ఛమైన ఆరోగ్యవంతమైన తాగునీటి సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ అశోక్ , సర్పంచులు , సచివాలయ సిబ్బంది , రెండు బృందాలుగా శిక్షణ పొందారు.

# 5 నెలలుగా జీతాలు అందక ఆయాల అవస్థలు




**పెనుగొండ, మేజర్ న్యూస్:** అష్ట కష్టాలు పడి అరకొర జీతాలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్స్ కు జీతాలు ఎప్పుడు అందుతాయో తెలియక అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలు వేతనాలు మంజూరు చేశామని చెబుతున్నా అంగట్లో అన్నీ ఉన్నా! అల్లుడి నోట్లో శని అన్న చందంగా ప్రభుత్వ వైఖరి ఉందని సిఐటియు పెనుగొండ మండల కార్యదర్శి ఆవుల శ్రీనివాస్ విమర్శించారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ బి అనిత కుమార్ కి, మండల విద్యాశాఖ అధికారి-2 రామకృష్ణ కు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జూన్ నెల వరకు జీతాలు ఇచ్చిన ప్రభుత్వం జూలై నెల నుండి నవంబర్ నెల వరకు నేటికీ ఐదు నెలల వేతనాలు చెల్లించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వేతనాలు పైనే జీవనాధారం సాగిస్తున్న అనేక కుటుంబాలకు ఇవే ఆధారం. గౌరవ వేతనం పేరుతో రూ.6వేలు ఇచ్చి బండెడు చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం కనీస వేతనం గా రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణం వేతన బకాయిలు చెల్లించి, కనీస వేతనం అమలు చేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సీపీకి మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గుడ్‌బై

మొదటిపేజి తరువాయి

పరాజయం తర్వాత, తన ఓటమి వెనుక పార్టీలోనే కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. అధిష్టానం కూడా ఈ విషయాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కాలంగా సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. వైయస్సార్సీపీలో తనకు సరైన ప్రాతినిధ్యం, గౌరవం అందలేదని గ్రంధి చెప్పారు. 2019లో పవన్‌ను ఓడించిన తర్వాత కూడా తనను పూర్తిగా చులకనగా చూడడం జరిగిందని, పార్టీలోనే కొందరు తనకు అన్యాయం చేశారని ఆరోపించారు.'మంచి పదవి ఇస్తే పవన్‌ను గొప్పవాడిని చేసినట్లు అవుతుందని భావించి నన్ను పక్కన పెట్టారు' అని వ్యాఖ్యానించారు. కాగా ప్రత్యక్ష రాజకీయాలకు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించారు.ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో ప్రత్యక్ష రాజకీయాలకు విరామం తీసుకుంటున్నట్లు గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. భీమవరం అభివృద్ధి కోసం తనవంతు ప్రయత్నాలు చేశానని,కానీ కొందరు చేసిన దుష్ప్రచారం తనకు మిగిలిన ప్రేమాభిమానాలను దూరం చేసిందని తెలిపారు.కాగా గ్రంధి శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేసి ప్రశాంతమైన జీవనం గడపాలని నిర్ణయం తీసుకున్నారు.

# నేటి నుండి జిల్లాలో రెవిన్యూ సదస్సులు

మొదటిపేజి తరువాయి

రెవిన్యూ సదస్సులలో గ్రామ స్థాయిలో ఉన్న సామాజిక సమస్యలు, వ్యక్తిగత సమస్యలను పూర్తి స్థాయిలో నిబద్ధతతో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులలో అధికారులు ప్రోటోకాల్ పాటించాలని, ప్రజా ప్రతినిధుల ను,రైతు సంఘాల నాయకులను ఆహ్వానించాలని అన్నారు. గ్రామంలోని ప్రజలకు తహసిల్దారు ద్వారా రెవిన్యూ సదస్సులకు ఆహ్వానం వెళ్లాలని చెప్పారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

## ప్రకృతి విపత్తుల నిధులు పక్కదారి పట్టించిన వైసిపి ప్రభుత్వం

మొదటిపేజి తరువాయి

అభివృద్ధికి సంబంధించిన నిధులు, ప్రకృతి విపత్తులకు సంబంధించిన నిధులను కూడా గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించడమే కాకుండా జేబులు నింపుకున్నారని ఎంపీ ధ్వజమెత్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా గోదావరి నదికి వరదలు పోటెత్తి, పెదవాగుకు గండి పడి వేలేరుపాడు మండలం ముంపునకు గురైన సందర్భంలో కూడా తమ కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టి, సాధారణ పరిస్థితులు వచ్చేవరకు పర్యవేక్షించి, బాధితులకు అండగా నిలిచిందని ఎంపీ తెలిపారు.

## మహిళలను వ్యాపారవేత్తలు చేయడమే లక్ష్యం

**కమిషనర్ అంజయ్య**



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు ప్రభుత్వం ఎన్నో పథ కాలు రూపొందించింది అని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య అన్నారు. గురువారం స్థానిక మెప్మా కార్యాల యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘ మహిళలు తయారుచేసిన వివిధ రకాల వస్తు వులను ప్రతిచోటా అమ్మకాలు చెయాలిఅన్నారు.డ్వాక్రా సంఘాలను నెలకొల్పి మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి చేయూత అందించాలనిసిబందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో సిహెచ్ మోహన్, సియం యం ఎం.వి.వి.సత్యనారాయణ, సిఓ ఆర్ షణ్ముఖ దేవి, జూనియర్ కమ్‌డిఈఓ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు



**దెందులూరు,మేజర్‌న్యూస్ :** మండలంలో ఉన్న రైతులు వారికి ఎటువంటి భూ సమస్యలు ఉన్న వచ్చేనెల 8 వ తారీకు వరకు జరిగే గ్రామాలలో జరిగే రెవెన్యూ సదస్సులలో అర్జీ చేసుకుని సమస్య పరిష్కరించుకోవచ్చని తాసిల్దార్ బత్తుల సుమతి తెలిపారు. ఎమ్మార్వో కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దెందులూరు మండలంలో ఉన్న రైతులందరూ వారికి ఎటువంటి భూ సమస్యలు సరిహద్దు వివాదాలు,ఎటువంటి భూ సమస్యలు ఉన్న గ్రామాలలో జరిగే రెవెన్యూ సదస్సులలో అర్జీ చేసుకుని ఉచితంగా సమస్య పరిష్కరించు కోవచ్చు అని ఎమ్మార్వో అన్నారు. 12వ తారీకు సోమవరప్పాడు,13వ తారీకు ఉప్పుగూడెం చల్లపల్లి, 16వ తారీఖు కొవ్వలి 17వ తారీఖు దోసపాడు, 19వ తారీఖు పోతునూరు, 20వ తారీకు దెందులూరు, 21 తారీకున చలచింతలపూడి, 23 తారీకున ముప్పవరం నరసింహపురం, 24వ తారీఖు నాడు రామన్నగూడెం ,మలక చర్ల, 27వ తారీకు నాడు కొత్తగూడెం, సింగవరం, కొమరేపల్లి, 28వ తారీఖు నాడు గాలాయ గూడెం,30వ తారీఖు అక్కిరెడ్డిగూడెం, నాగుల దేవునిపాడు, జనవరి మూడవ తారీకు నాడు తిమ్మన్నగూడెం,నాలుగో తారీఖు నాడు మేధనరావు పాలెం, గుడిగుంట, ఆరవ తారీఖు నాడు శ్రీరామవరం, 8వ తారీఖు నాడు సింగగూడెంలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని దెందులూరు మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి భూ సమస్యల పరిష్కరించుకోవాలని ఎమ్మార్వో సుమతి కోరారు.

## స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ - 2047 ఆవిష్కరణకు తరలి వెళ్లుతున్న ప్రతినిధులు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ను విడుదల చేయనున్నారు. ఈ నేపద్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లానుంచి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రతినిధులు తరలివెళ్లుతున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి జిల్లానుంచి 20 బస్సుల్లో వివిధ రంగాలకు చెందిన సుమారు వెయ్యి మంది ప్రతినిధులు వెళ్లేందుకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారి సూచనల మేరకు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లానుండి బయలుదేరి తిరిగి జిల్లాకు చేరుకునేంతవరకు సంబంధిత సమన్వయ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంధ సంస్థలు, వివిధ రంగాల్లో ప్రతిభావంతులు, రైతులతో కూడిన బృందాలు విజయవాడ వెళ్లేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతిపురంమన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి విజయవాడకు వెళ్లే ప్రతినిధులకు ఏలూరులో 10 ప్రాంతాల్లో హోల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఆయా హోల్టింగ్ పాయింట్లలో సంబంధిత ప్రతినిధులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పలువురు జిల్లా అధికారులను పర్యవేక్షక అధికారులుగా నియమించారు. సంబంధిత ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమీక్షిస్తూ ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు.

## 14వ తేదీ నుంచిజాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

**భీమవరం,మేజర్‌న్యూస్ :** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను డిసెంబర్ 14 నుండి డిసెంబర్ 20 వరకు విద్యుత్ శాఖఆధ్వర్యములో నిర్వహించనున్నట్లు ఎ.పి.ఇ. పి.డి.సి.ఎల్ ఎస్.ఇ ఆలపాటి రఘునాథ్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రము,డివిజన్ కేంద్రములలో నిర్వహించడం జరుగు తుందన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తముగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ మరియు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా స్వయం సహాయక మహిళ బృందాలతో ముగ్గల పోటీలు నిర్వహించి,వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు ,స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పించుట జరుగుతుందన్నారు. "విద్యుత్ పొదుపు ఆవశ్యకత,నూతన సాంకేతిక విజ్ఞానము" అనే అంశముపై నిష్ణాతులచే ఇంజనీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు నిర్వహిస్తారనన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు డిసెంబర్ 20న బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంధన వారోత్సవాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా విజయవంతం చేయాలని కోరారు.

## ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులపై కేసు నమోదు

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు రూరల్ మండలం,పైడిచింతపాడు గ్రామంలో ఇటీవల పెన్షన్ మంజూరు విషయంలో జనసేన,టీడీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణకి సంభందించి ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో పైడిచింతపాడు గ్రామ టీడీపీ అధ్యక్షులు ముంగర పెద్దిరాజు,ఏలూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు నంబూరి నాగరాజు,ఏలూరు రూరల్ మండల టీడీపీ సీనియర్ నాయకులు నేతల రవి,ఏలూరు కి చెందిన యాకోబుతో సహా 20 మందిపై కేసు నమోదైంది.

జనసేన,టీడీపీ నాయకులు మధ్య జరిగిన ఘర్షణ కారణంగా గాయాలపాలైన జనసేన నాయకులు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి కి రాగా అక్కడ టీడీపీ నాయకులు వారిని అడ్డుకుని,వారిపై దాడి చేయగా అక్కడ నుండి తప్పించుకుని ఏలూరులోని ఆంధ్ర హాస్పటల్ లో చికిత్స నిమిత్తం వెళితే అక్కడ కూడా టీడీపీ నాయకులు అడ్డుకుని దాడి చేసే ప్రయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ నుండి కూడా తప్పించుకుని విజయవాడలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో చికిత్స కోసం చేరగా అక్కడ ఉన్నటువంటి పోలీస్ ఔట్ పోస్ట్ లో ఎమ్మెల్సీ నమోదు చేసి దీన్ని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ కి పంపగా దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆ ఎమ్మెల్సీ ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగింది.ఇదే విషయంపై గతంలో 11 మంది పైడిచింతపాడు గ్రామ జనసేన నాయకులపై కూడా ఇదే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది.

# బాలల హక్కులు, సంక్షేమ పథకాలు,చట్టాలపై అవగాహన




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రస్తుత సమాజంలో బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాలు, బాలకార్మికులు, భిక్షాటన చేయు బాలలు, బాలల హక్కులు, సంక్షేమ పథకాలు,చట్టాలు గురించి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్రవేణి వివరించారు. మహిళాభివృది మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకం ద్వారా బాలల హక్కులు, సంక్షేమ పథకాలు,చట్టాల పై అవగాహన కార్యక్రమం నూ లైన్స్ క్లబ్,జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అమలోద్భవి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు విద్యార్థులు కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలకు ఎటువంటి సమస్య వచ్చిన చైల్డ్ హెల్ప్ లైన్ 10 98కి కాల్ చేస్తే సమస్యలు పరిష్కరించడము జరుగుతుందన్నారు. అలాగే సంక్షేమ పథకాలుపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్యానెల్ అడ్వకేట్ కూన కృష్ణారావు మాట్లాడుతూ బాలల పై జరిగే లైంగిక వేధింపులు నివారణ చట్టం, సెల్ ఫోన్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత సమాజంలో ఉన్న స్థితి గతులు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అమలోద్భవి స్కూల్ హెచ్ఎం సిస్టర్ నిర్మల, లైన్స్ క్లబ్ సివి రమణ, మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలు సమాజంలో జరుగుతున్న మార్పుల పట్ల అవగాహనను కలిగి ఉండాలన్నారు.

## నేడు అశోక్ నగర్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా , ఏలూరు మండలం , నార్త్– ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11కెవి అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11కెవి పత్తేబాద్ ఫీడర్ కు చెట్ల కొమ్మలు తొలగించుట,లైన్లకు మరమ్మతు చేయుటకు 13వ తేదీ శుక్ర వారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు మరమత్తులు జరుగుతయి. అశోక్ నగర్ స్టేషన్ పరిధిలో గల పత్తేబాద్, రైతు బజార్,భవిష్య క్లినిక్ ఏరియా విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఏలూరు కె.ఎం.అంబేద్కర్ఒక ప్రకటనలో తెలిపారు. కనుక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే మద్దిపాటి



**ద్వారక తిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం కుటుంబ సభ్యుడు కొండా డేవిడ్ వివాహ వేడుకకు స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ క్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లంక సత్యనారాయణ, టిడిపి నాయకులు మాజీ జెడ్పీటీసీ సభ్యులు డి వీరాస్వామి, మట్టపర్తి రూపేష్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వున్నారు.

## సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** మండలంలోని తిమ్మాపురం గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్మాణ కర్త బోళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అభిషేకాల్లో పాల్గొని తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుస్థిర అభివృద్ధిపై మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులను స్థానిక వెలుగు కార్యాలయంలో హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే వెంకటలక్ష్మి, ఎంపీపీ కే పోచమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన సుస్థిర అభివృద్ధి ప్రణాళికలను తెలుసుకొని తద్వారా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి నిఖిల్, వెలుగు ఎపిఎం ఎన్ ఝాన్సీ, అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీదేవమ్మ, పలు శాఖల అధికారులు సర్పంచ్ లు కార్యదర్శులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల నాణ్యతపై అశ్రద్ధ వహిస్తే ఉపేక్షించం

**– రోడ్ల నిర్మాణ పనులను**
**ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే చింతమనేని**



**పెదపాడు,మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పెదపాడు మండలం పెదపాడులో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పనులు పరిశీలించారు. రోడ్ల నిర్మాణం పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్‌ను సత్వరమే తన తీరు మార్చుకోవాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడినా అవినీతి, అలసత్వాలకు పాల్పడినా సహించబోమని రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థ ప్రతినిధులకు సూచించారు గతంలో చేయని పనులకు బిల్లులు పెట్టడం, నాణ్యత లేని పనులు చేసి ప్రజా ధనాన్ని దోచుకునీ దగా చేసిన వైసిపి అవినీతి ప్రభుత్వం వంటిది తమ కూటమి ప్రభుత్వం కాదని, ఎట్టి పరిస్థితుల్లో ఎక్కడైనా అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిన సహించం అని హెచ్చరించారు. అదే విధంగా నియోజకవర్గంలో జరుగుతున్నటువంటి రోడ్ల మరమ్మత్తులు సహా నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు నాణ్యతలను పరిశీలించేలాగా సెక్షన్‌అధికారులను నియమించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రతిరోజు పనుల ప్రోగ్రెస్‌ను ఉన్నత అధికారులకు తెలియపరిచేలాగా సెక్షన్ అధికారులను నియమించి నిర్మాణ పనులను వాటి నాణ్యతను ఉన్నతాధికారులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బిశాఖా సూపరిండెంట్ ఇంజనీర్ జాషువాకు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు.
ఈ కార్యక్రమం లో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాస్, పెదవేగి పార్టీ ప్రెసిడెంట్ బొప్పన సుధసహోపలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బిషప్ జాన్ ములగాడకు ఘన నివాళులు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో గురువారం స్వర్గీయ బిషప్ జాన్ ములగాడ 87వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ , సెక్రెటరీ ఫాదర్ జి మోజెస్ అధ్యక్షతన బిషప్ జాన్ విగ్రహానికి పూలమాలంకరణ జరిపి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల గ్రామం తెలుగుదేశం నాయకుడు మధు గుంజ పాల్గొన్నారు కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫిలిప్స్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకబ్ డెంటల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ,సిబ్బంది,విద్యార్థులు నివాళులర్పించారు

# జిల్లాలో ఇంతవరకు 64 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు

**– అక్కడికక్కడే 96 అర్జీల పరిష్కారం : జెసి పి.ధాత్రిరెడ్డి**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** భూస మస్యల పరిష్కారమే ధ్యేయ ంగా జిల్లాలో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకో వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. ఏలూరు జిల్లాలోభూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మీభూమి..మీ హక్కు' పేరుతో గురువారం ఏర్పాటుచేసిన రెవిన్యూ సదస్సుల నిర్వహణపై జేసీ వివరాలు తెలియజేసారు. జిల్లాలో 28 మండలాల్లో మొత్తం 665 రెవిన్యూ గ్రామాలుండగా గత రెండు రోజుల్లో 64 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. గురువారం నిర్వహించిన 30 రెవిన్యూ సదస్సుల్లో 1212 మంది పాల్గొని ఆయా సమస్యలపై 487 అర్జీలను అందజేశారని, వాటిలో 71 దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. రెవిన్యూ సదస్సులలో అందిన విజ్ఞప్తులను 45 రోజులలోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత రెండురోజుల్లో నిర్వహించిన 64 గ్రామ రెవిన్యూ సదస్సుల్లో 854 అర్జీలు రాగా వాటిలో అక్కడికక్కడే 96 అర్జీలు పరిష్కరించబడ్డాయన్నారు. రెవిన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. జనవరి 8వ తేదీ వరకు ఆయా గ్రామల్లో నిర్వహించే రెవిన్యూ సదస్సులలో ప్రజలు పాల్గొని తమ భూములకు సంబందించిన సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు.

# రెవెన్యూ సదస్సుల సేవలు వినియోగించుకోవాలి



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** రెవెన్యూ సదస్సుల సేవలను వినియోగించుకోవాలని,రెవెన్యూ సదస్సుల మండల ప్రత్యేక అధికారి,బిసి సంక్షేమ జిల్లా అధికారి ఆర్.నాగమణి కోరారు. మండలంలో రెవెన్యూ సదస్సులు గురువారం ప్రారంభమయ్యాయి. గుండుగొలను రెవెన్యూగ్రామ పరిధిలో నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా సంబంధిత విభాగ ప్రత్యేక అధికారి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భీమడోలు తహసిల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ, ప్రస్తుతం నిర్వహిస్తున్న సదస్సులో 49 సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
సదస్సులో 42 వినతులు రాగా,వాటిలో 26వినతులను తక్షణమే పరిష్కరించామని, మిగిలిన వాటికి త్వరలో పరిష్కరించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ధర్మారావు, ఆర్.ఐ. కిరణ్ కుమారి, దేవస్థాన ఇఓ వంశీ,గ్రామరెవెన్యూఅధికారిసింహాచలం పాల్గొన్నారు.

# 10 లీటర్ల నాటు సారా స్వాధీనం

**: 1600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం**



**టి.నరసాపురం,మేజర్ న్యూస్ :** ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్,డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ జిల్లా వారి ఆదేశాలు ప్రకారం చింతలపూడి స్టేషన్ పరిధిలో గల టి.నరసా పురం మండలం మద్యాన్నపు వారి గూడెం గ్రామంలో నాటు సారా స్థావరాల పై దాడులు నిర్వహించగా అదే గ్రామనికి చెందిన తాడిపర్తి వెంకట రమణ అనే వ్యక్తి కి సంబంధించిన 10 లీటర్ల నాటు సారా స్వాధీన పరుచుకున్నట్టు ఎక్సైజ్ సి.ఐ పి.అశోక్ తెలిపారు. అతనికి సంబంధించిన నాటు సారా తయారీకి పనికి వచ్చే 8 ప్లాస్టిక్ డ్రమ్ములలో నిల్వ ఉంచిన సుమారు 200 లీటర్ల పరిమాణములో ఉన్న మొత్తం 1600 లీటర్ల బెల్లపు ఊటను పూర్తిగా ధ్వంసం చేసి, ఆ వ్యక్తి పై స్థానిక చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ నందు పరారీ కేసు నమోదు చేశారు. టి.నరసాపురం మండలం, మక్కినవారిగూడెం గ్రామంలో పాత బెల్ట్ షాపు నిర్వాహకుడు కేసులో ముద్దాయి అయిన దొంతు కౌసల్యారావు ను 129 బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తహసీల్దార్ టి.నరసాపురం వారి ఎదుట హాజరు పరచి బైండ్ ఓవర్ నమోదు చేశారు. ఈ దాడులలో ఈఎస్‌టిఎఫ్ ఏలూరు సిబ్బంది,స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ.లు ఆర్.వి.ఎల్. నరసింహారావు ,అబ్దుల్ ఖలీల్,సిబ్బంది పాల్గొన్నారు

# ప్రజలకు ఇబ్బంది లేని విధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

**– మున్సిపల్ అధికారులకు జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం**



**భీమవరం,మేజర్ న్యూస్ :** భీమవరం పట్టణంలోని అంబేద్కర్, ప్రకాశం చౌక్ సెంటర్ లలో గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పర్యటించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా అంబేద్కర్ జంక్షన్ వద్ద అభివృద్ధి పరిచేందుకు అంబేద్కర్ విగ్రహం చుట్టూ లైటింగ్ ఏర్పాటులో బ్రిడ్జి పక్కన ఖాళీగా ఉన్న ప్రాంతంలో పార్కులా అభివృద్ధి చేయుటకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రకాశం చౌక్ వద్ద డ్రెయిన్ పై ఉన్న షాపుల తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకొని, ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని మున్సిపల్ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఏసిపి శ్రీలక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాధ రావు, డిఈఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి పార్థసారథి, తదితరులు ఉన్నారు.

# గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిడిఓ

**భీమడోలు,మేజర్‌న్యూస్ :** సుస్థిర అభివృద్ధి అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల సారాంశాన్ని గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు అవగాహన చేసుకుని, వాటిని. గ్రామపంచాయతీల అభివృద్ధికి అన్వయి ంచుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి,శిక్షణా తరగతుల కోర్సు డైరెక్టర్ పద్మావతి దేవి కోరా రు. శిక్షణా తరగతులను రెండు విడతలగా విభజించి,తొలుత 9 గ్రామ సచివాలయాలకు వర్తింపజేసి, వారికి రెండు రోజులపాటు తరగతులను కొనసాగనించనున్నామన్నారు. దీనిలో భాగంగా గురువారం 7 గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై తరగతుల మొదటి రోజు కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న తరగతుల్లో తొలి రోజు 9 అంశాలపై సంబంధిత శాఖల అధికారులు అవగాహన కల్పించమన్నారు. దీనిలో భాగంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన భీమడోలు సహాయ ఇంజనీర్ సూర్యచంద్రరావు, గ్రావీ ుణ నీటి సరఫరా విభాగం భీమడోలు సహాయ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం,




వెలుగు కార్యాలయ ఎపిఓ రత్నకుమారి, ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ పూళ్ళ పర్యవేక్షకులు నూర్జహాన్ తమ శాఖల పరంగా గ్రామాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, ప్రభుత్వం అందజేస్తున్న సహాయ సహకారాలు రాయితీలు ఇతర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరితో పాటు పలువురు సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలకు సహకరించండి : ఎమ్మెల్యే బాలరాజు విజ్ఞప్తి



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని కూటమి మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించినట్లు శాసనసభ్యులు చిర్రి బాలరాజు తెలిపారు. బుధవారం జీలుగుమిల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏడు మండలాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూపోలవరం నియోజక వర్గంలో ఐదుమండలాల నీటవినియోగదారుల సంఘాలు ఉన్నాయన్నారు. ఈ సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణ ఎపిఎఫ్ఎంఐఎస్ యాక్ట్ 1997 ప్రకారం ఏలూరు జిల్లా నందు 354 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు. పోలవరం నియోజకవర్గానికి సంబంధించిన నీటి సంఘాల ఎన్నికలకు కూటమి నాయకులందరూ సహకరించి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలోని ఏడు మండలాలలో ప్రధాన సమస్యలపై సమీక్ష నిర్వహించామని అన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించాలని ఏడు మండల అధ్యక్షులు సూచించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కూటమి ఏడు మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో అభయ మహిళా రక్షక దళం తనిఖీలు



ఏలూరు,మేజర్‌న్యూస్ : జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై గురువారం జిలాల్లో ఏలూరు ,నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్లో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అభయ రక్షక మహిళా రక్షక దళ సభ్యులు గస్తీ నిర్వహించారు. అన్ని పోలీస్ స్టేషన్ అభయ మహిళా రక్షక దళ సభ్యులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్కూళ్లు కాలేజీలు పబ్లిక్ స్థలాలు బస్టాండ్లు తదితర ప్రదేశాలలో మహిళలపై ఆకతాయిలు వేధింపులకు పాల్పడకుండా అభయ రక్షక మహిళ సిబ్బంది గస్తీ చర్యలను ముమ్మరం చేశారు. మహిళలకు గాని ఎవరికి అయినా అత్యవసరమైనటువంటి పరిస్థితుల్లో వెను వెంటనే పోలీసువారి సహాయం పొందాలంటే డయల్ 112 ఫోన్ చేసిన పది నిమిషాల వ్యవధిలో బాధితులకు రక్షణ కల్పించేలాగా జిల్లా ఎస్పీ ఏర్పాటు చేశారు. బాధితులకు సత్వర రక్షణను కలగ చేస్తారని మహిళా సిబ్బంది మహిళలకు విద్యార్థినిలకు భరోసా కల్పించారు. స్కూల్లో వద్ద సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటున్నటు వంటి బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లను గురించి విద్యార్థినులకు అభయ టీం సభ్యులు తెలియచేశారు. చుట్టుపక్కల ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగు తున్నాయని అనుమానం కలిగిన వెంటనే డయల్ 112కు గాని,జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన వాట్సాప్ నెంబర్ 9550351100 సమాచారాన్ని అందించిన ఎడల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల గురించి ఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు,ఆన్లైన్ జాబ్స్/వర్క్ డిజిటల్ అరెస్టు 112,1930, 1972లో ఉపయోగం గురించి వివరించి విద్యార్థులకు, ప్రజలకు అభయ మహిళా రక్షక దళం సభ్యులు అవగాహన కల్పించారు.

## సచివాలయానికి వెళ్లే రోడ్డు ఆక్రమణలు తొలగించాలి



**కలిదిండి,మేజర్ న్యూస్,** కలిదిండి మండలం కాళ్లపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన ఆంధ్ర తెలంగాణ రాధా రంగా మిత్ర మండలి ఛారీటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కాళ్లపాలెం బుజ్జి ఆర్ అండ్ బి రోడ్డు నుండి సచివాలయంకి వెళ్లే రోడ్డు అక్రమనకి గురు అయ్యింది. అని ఈ ఆక్రమణ తొలగి ంచాలని బుజ్జి తాసిల్దార్‌కి, విఆర్ఓకి అర్జీ వివటం జరిగింది.

కలిదిండిమండలం జడ్పీటీసీ బొర్రా సత్యవతి ని విన్నవించుకోగా ఈ సిమెంట్ రోడ్డుకి పది లక్షల రూపాయలను కాళ్లపాలెం బుజ్జి మంజూరు చెవించటం జరిగింది. ఈ సిమెంట్ రోడ్డు నిర్మించాలని ఈ ఆక్రమణ తొలగించాలని తాసిల్దార్‌కి పిర్యాదు చేసినారు. ఈ కార్యక్రమంలో పెటేటి రంగా రావు,పన్నాస సందీప్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే బడేటి చంటి

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** నిష్పక్షపాతంగా అందించే పాలనే ప్రజా ప్రగతికి వాస్తవ సోపానమని ఎమ్మెల్యే బడేటి చంటి ఉద్ఘాటించారు. సామాజిక పింఛన్ల పెంపుతో దాన్ని సుసాధ్యం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి నియోజకవర్గంలోని పలువురు చేరుకుని, తమ సమస్యలను ఎమ్మెల్యే బడేటి చంటికి విన్నవించారు. ముఖ్యంగా తమ అనారోగ్య పరిస్థితులను కొందరు విన్నవించగా,, పింఛన్ సమస్యలను ఎమ్మెల్యే చంటి దృష్టికి మరికొందరు తీసుకువచ్చారు. వారందరి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులను అన్నివిధాలా ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషిచేస్తోందన్నారు. దీంట్లో భాగంగానే వారికి పింఛన్ పెంపును తొలి ప్రాధాన్యతగా తీసుకున్నామన్న విషయాన్ని గుర్తుచేశారు. సంక్షేమాల అమలులో ఎక్కడా ఎటువంటి అవకతవకలకు



ఆస్కారం లేకుండా పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బెల్లపుకొండ కిషోర్, శిగిరెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి క్షత్రియ సేవా సమితి సలహాలు తీసుకుంటాం

**– ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు**



**భీమడోలు,మేజర్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి క్షత్రియ సేవా సమితితో పాటు ఇతరులు ఇచ్చే సలహాలు, సూచనలు స్వీకరిస్తానని, ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పొలసానిపల్లి గ్రామంలో గురువారం క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఉంగుటూరు శాసనసభ్యులతో పాటు, టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజ కవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, క్షత్రియ సేవా సమితి డైరెక్టర్ వాసు రాజులను సత్కరించారు. కార్యక్రమాన్ని క్షత్రియ సేవా సమితికి చెందిన పేరిచర్ల కృష్ణంరాజు నిర్వహించారు. కార్యక్రమంలో పొలసానిపల్లి గ్రామ సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, దీనిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉంగు టూరు నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు అభిమానులు, భీమడోలు మండల జనసేన పార్టీ అధ్యక్షులు పత్తి మదన్ ,పాల్గొన్నారు..

## 'సూర్య'వార్తకి స్పందన
## రేషన్ షాపులు,ఎండియు వాహనాలు ఆకస్మిక తనిఖీ





**ఇరగవరం,మేజర్‌న్యూస్ :** పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం. కదనం గురువారం వెలువడిన సంగతి తెలిసిందే దినిపై అధికా రులు స్పందించారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో రేషన్ షాపులు,ఎండియు వాహనాలను ఆకస్మిక తనిఖీ నిర్వహిం చారు. రేషన్ బియ్యం అమ్ముకునేవారి రేషన్ కార్డు రద్దు చేస్తామ ని సివిల్ సప్లై రెవిన్యూ ఇన్స్పెక్టర్ కె.వి.వి.సత్యనారాయణ మేజర్ న్యూస్‌కి తెలిపారు. గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామా ల్లో రేషన్ బియ్యం వినియోగన్ని పెంచేవిధంగా ప్రజల్లో ఆగాహన కల్పించడానికి పంచాయతీ సిబ్బంది ద్వారా ప్రచారం నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఎవరైనా బియ్యం విక్రాయించిన త దృష్టికి తీసుకురావాలని అయన కోరారు. రేషన్ డీలార్లు, యమ్‌డియు పంపిణిదరులు అవకతవకలకు పాల్పడవద్దని అటువంటివారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అన్ని గ్రామాల్లో రెవిన్యూ సభలు




**ఇరగవరం,మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాల్లో రెవిన్యూ గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు రిసర్వే రెవిన్యూ ఇన్స్పెక్టర్ కె.పోతురాజు చెప్పారు.పేకేరు, కొత్తపాడు, గ్రామాల్లో ఈనెల 13న.ఇరగవరం, అర్జునుడిపాలెం 16న.,కత్తవపాడు, పొడలాడ 17న,రేలంగి18న,ఎర్రయిచెర్వు, గోటేరు19న,ఇస్ట్ విప్పర్రు, కంతేరు 20న, కాకిలేరు, కె.కె.వల్లి 21న,రాపాక ,ఖం ద్రిక21న, కె.ఇల్లిందలపర్రు, సూరంపూడి 23న,రాపాక 24న, గురువు గుంట ఖండ్రక, ఏలేటిపాడు.ఐతంపూడి 27న. కావలిపురం,28న.ఐనపర్రు, ఓగిడి 30న.కాకిలేరు 31న సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి డాన్స్ బేబీ పోటీలలో కలిదిండి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు



**కలిదిండి,మేజర్ న్యూస్ :** కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధి నందు రాష్ట్రస్థాయి డాన్స్ బేబీ కాంపిటీషన్ జరిగినవి. ఈ కార్యక్రమంలో వైజాగ్ నుంచి కైకలూరు నుంచి,కలిదిండి నుంచి కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కాంపిటేషన్ మూడు రౌండ్లు జరగగా, మొత్తం మూడు రౌండ్‌లోను కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి కాంపిటీషన్లో మొదటి బహుమతిని గెలుచుకున్నారు.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్కూల్ కరస్పాండెంట్ సానా వెంకట రామారావు మీనా సరస్వతి, స్కూల్ ప్రిన్సిపల్ పాండురంగారావు మాట్లాడుతూ విద్యార్థులలో విద్యతోపాటు ఇటువంటి నైపుణ్యత శక్తిని అందించడంలో స్కూల్ యాజమాన్యం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. మొదటి బహుమతి సాధించి నగదు, ట్రోఫీ సాధించుకున్న పల్లవి గ్రూపును ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్జిలుగా వ్యవహరించిన చెన్నం శెట్టి భాస్కర,కోరుకొల్లుసర్పంచ్,కుమారి మేడం మాట్లాడుతూ కలిదిండి ఇంగ్లీష్ మీడియం చిన్నారులు వివిధ రకాల వేషధారణతో తమ హావ భావాలను వ్యక్తం చేస్తూ లయబద్ధంగా నృత్యం చేస్తూ, ప్రేక్షకుల మనసు దోచుకున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో ఎన్డీఏ నాయకులు



ముదినేపల్లి ,మేజర్ న్యూస్ : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్టి ఉత్సవాల్లో ఎన్డీఏ నాయకులు శ్రీ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు వీరిని ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్ , ఆలయ అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు అందజేసి శ్రీస్వామివారి చిత్ర పటాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బికేఎం నాని , పూల రామచంద్రరావు , బోయిన శ్రీనివాసరావు ,దావు నాగరాజు, ప్రసాదరాజు , షష్టి ఉత్సవ కమిటీ సభ్యులు పరసా కృష్ణ , పత్తి శివశంకర్ , నాయకులు పాల్గొన్నారు.

### నేడు భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

**భీమడోలు,మేజర్ న్యూస్ :** భీమడోలు 33 కె.వి. విద్యుత్ ఉపకేంద్రంకు అనుబంధంగా గల పలు విద్యుత్ ఉప కేంద్రాల్లో ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో భీమడోలు ఎఇ.తెలిపారు.

దీనిలో భాగంగా ఆ ప్రాంతాలలో పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న వాటి క్రమబద్ధీకరణతో పాటు, విద్యుత్ స్తంభాలపై గల పాడైన కండక్టర్ల స్థానంలో నూతన కండక్టర్లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భీమడోలు, పొలసానిపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఆయన తెలిపారు.ఆ ప్రాంతంలో గల విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్ కోకు. సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సుస్తిర అభివృద్ధి లక్ష్యాలపై

# అవగాహన




**కుక్కునూర్, మేజర్‌న్యూస్ :** జిల్లా అధికారులు ఆదేశాల మేరకు బుధవారం నాడు మండలంలో గల ఎంపీడీఓ కార్యాలయంలో సుస్తిర అభివృద్ధి లక్ష్యలు పై ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న అగ్రికల్చర్ ఎడి బుజ్జి బాబు మాట్లాడుతూ పేదరికం నిర్మూలించడం అంటే పేదలకు అన్ని పతకాలుఅందె విధాగా అధికారులు పనిచేయ డంపజలకు మంచి నీళ్లు పూర్తి స్థాయిలో అందించడం చదువు ప్రతి ఒక్కరికి పక్క ఇల్లు కట్టించడం బాల్య వివాహ లు నిర్మూలించడం ఇవన్నీ కూడా సుస్థిర అభివృద్ధిలో భాగమేనని వారు అన్నారు

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహారావు ఏ ఈ విరస్వామి సీడీపీఓ లక్ష్మి కుమారి ఏపీఎం భానుమతి యం ఈ ఓ గిరిబాగవాన్ దాష్ యంఆర్‌సి రమేష్ ఏపిఓ మాధవరావు హెల్త్ డిపార్ట్మెంట్ సచివాలయం అధికారులు పంచాయతీ కార్యదర్సులు తదితరులు పాల్గొన్నారు

## 26,27 తేదీల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు : జిల్లా కార్యదర్శి బలరాం

**నర్సాపురం, మేజర్ న్యూస్ :** వశిష్ట వారిది నిర్మాణం చేపట్టాలని ఫిషింగ్ హార్బర్ త్వరితిగతిన పూర్తి చేయాలని కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ పనులను వేగవంతం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి బలరాం డిమాండ్ చేశారు స్థానిక మీరా గ్రంథాలయంలో సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో బలరాం మాట్లాడారు డిసెంబర్ 26 27 తేదీల్లో నరసాపురం పట్టణంలో సిపిఎం పార్టీ రాష్ట్రస్థాయి సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశాలకు రాష్ట్ర కమిటీ సభ్యులు ఆల్ ఇండియా నాయకులు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర కమిటీలో చర్చించి సమస్యలు పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తారన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతం అభివృద్ధికి ముఖద్వారంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు ఈ ప్రాంతంపై దృష్టి సారించి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉభయగోదావరి జిల్లాలను అనుసంధానం చేసే వశిష్ట వారిది నిర్మాణం చేపట్టాలన్నారు సముద్ర తీరంలో ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన హార్బర్ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ వేగవంతంగా పూర్తి చేయాలని,నరసాపురం టు మచిలీపట్నం రైల్వే లైన్ పనులను చేపట్టాలన్నారు.తీర ప్రాంతంలో ఉత్పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి ఈ ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాంత యువతకు ఉపాధి ఉద్యోగ



అవకాశాలను కల్పించే విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరునెల పరిపాలనలో త్రాగనీరు కన్నా మద్యానికి ప్రాధాన్యతిస్తూ బెల్టు షాపుల ద్వారా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు,మండల కమిటీ సభ్యులు తెలగంశెట్టి సత్యనారాయణ,పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు,నోములకొండ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిషప్ జాన్‌కు నివాళులర్పించిన కతోలిక ప్రతినిధులు



పెదవేగి,మేజర్‌న్యూస్ : స్థానిక జేవియర్ నగర్‌లో పూర్వపు బిషప్ ఘనమైన జాన్ ములగాడ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించిన కతోలిక్ విశ్వాస ప్రతినిధులు. ఏలూరు మేత్రాసన వికార్ జనరల్ ఫాదర్ బాల,దోమతోటి అబ్రహం,కలతోటి డొమినిక్,బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు మత్తే బాబి తదితరులు ముందుగా బిషప్ జాన్ ములగడకు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంతరం జేవియర్ నగర్లో ఉన్నటువంటి పేదలకు అన్నదానం నిర్వహించారు. కతోలిక్ విశ్వాస ప్రతినిధులు మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య, వైద్యం, నివాసం కల్పించిన పూర్వపు బిషప్ జాన్ ములగడ ఉంది, ఆయన ఆశయాలు కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని,త్వరలో జేవియర్ నగర్లో గల బాయ్స్ కాన్వెంట్ ఎదురుగా ఆయన పేరిట లైబ్రరీ నిర్మించాలని ఆలోచన చేస్తున్నట్లుగా తెలిపారు.

## తుమ్మగూడెంలో రెవెన్యూ సదస్సు



**చాట్రాయి,మేజర్ న్యూస్** మండలంలో గురువారం నాడు తుమ్మగూడెం గ్రామంలో తాసిల్దార్ ప్రశాంతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సర్వే కోసం 5. పాసుపుస్తకాలు కోసం 8 అర్జీలు వచ్చాయని తాసిల్దార్ ప్రశాంతి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూకార్యదర్శి ప్రజలు పాల్గొన్నారు.

## నేటి నుండి రెవెన్యూ సదస్సులు

**పాలకొల్లు, మేజర్ న్యూస్:** ఈ నెల 13వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు పాలకొల్లు మండలంలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ తెలిపారు, గ్రామాల్లో ఉన్న భూ సమస్యలపై పరిష్కార దిశగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు దీనిలో భూ సమస్యలపై చర్చించి న్యాయం చేస్తారని తెలిపారు, పాలకొల్లు రూరల్ పంచాయితీ నందు నేడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సు జరుగుతుందని సమస్య ఉన్న వారు విధిగా పాల్గొని కోరారు,

## కామధేను బెస్ట్ ఫాదర్ అవార్డు గ్రహీత డా.మనోజ్‌కు ఘనసత్కారం



**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుండి కామధేను బెస్ట్ ఫాదర్ అవార్డు గ్రహీత డాక్టర్ అంబుల మనోజును శ్రీకృష్ణ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ చాలువాతో ముదినేపల్లిలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈవో సచ్చివోలు రాంబాబు , డాక్టర్ మనోజ్ రాష్ట్ర అభివృద్ధికి 40 లక్షలు సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేయడం అర్హనీయమన్నారు. ఇలాంటి వైద్యులు ముదినేపల్లిలో ఉండడం ఆయన పేద వర్గాలకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ డిప్యూటేషన్‌ల జీవో రద్దు చేయాలి

- ఉపసంహరించుకోకపోతే ఆందోళన
- ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరిక



బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్: సర్వీస్ రూల్స్‌కి విరుద్ధంగా ఉపాధ్యాయులను డిప్యూటేషన్ లపై అంతర్ జిల్లాలకు బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏటి ఏ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు, తెల్లం రాములు,టి డబ్ల్యూ టియు రాష్ట్ర అధ్యక్షులు మొడియం గంగరాజులు అన్నారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ధర్నా చేశారు.

ఈ సందర్భంగా జలగం రాంబాబు, మొడియం గంగరాజు,తెల్లం రాములు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలోని నియామకాలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలోని అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె చేయడం తో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ జి టిలను కడప, కర్నూలు,చిత్తూరు, జిల్లాలకు బదిలీ చేశారని తెలియజేశారు. ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను 800 నుండి 1000 కిలోమీటర్ల దూరానికి బదిలీ చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం డిప్యుటేషన్ జీవోని రద్దు చేయాలని లేనిపక్షంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కోర్సా సతీష్,జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు మాట్లాడుతూ సంవత్సరం మధ్యకాలంలో డిప్యుటేషన్లు పెట్టి అక్కడ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ పిల్లల్ని ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు నాయకులు పాయం పోశియ్య, మడకం కృష్ణమోహన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హలో మాల -15న ఛలో గుంటూరు

- భారత మాల మహాసంగ్ ఫౌండేషన్ డివిజన్ నాయకులు పిలుపు



జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ : ఈనెల 15వ తేదీ ఆదివారం గుంటూరులో తలపెట్టిన మాలల ఐక్య సమ్మేళనం కార్యక్రమానికి మాల సోదరీ సోదరీమణులు హాజరుకావాలని భారత మాల మహాసంగ్ ఫౌండేషన్ నాయకులు పొడపాటి దుర్గారావు, పైడిమాల కృష్ణ, కుమ్మరపల్లి ప్రకాష్, కొత్తూరు రాజ్ కుమార్ మాల కోరారు. గురువారం దర్భ గూడెం లోని పొడపాటి దుర్గారావు నివాసంలో ఫౌండేషన్ సంఘ సభ్యులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ హలో మాల – చలో గుంటూరు కార్యక్రమానికి భారీగా మాల సోదరులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరించి వారి ఎదుగుదలను అణిచివేయాలని కుట్ర జరుగుతుందని అన్నారు. వర్గీకరణతో పాటు క్రిమిలేయర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీలో ఉన్న 59 ఉపకులాలకు ఇది నష్టం జరిగే పరిణామమని సూచించారు. వర్గీకరణ వలన భవిష్యత్తులో తామంతా నష్టపోనున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలని కోరుతూ మాలల ఐక్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. అందరూ కలిసి ఒకతాటిపై ఉండి తమ గళాన్ని, జాతి ఐక్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినిపించాలని కోరారు. లక్షలాదిగా మాలలంతా తరలివస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్జా సాగర్, తలారి సతీష్, బొంతు రామకృష్ణ, గుర్రం కాంతారావు, ఎర్రమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గొలుసు దుకాణం నిర్వాహకుడి అరెస్టు



భీమవరం,మేజర్ న్యూస్: జిల్లా మద్య నిషేధ,ఆబ్కారీ అధికారి ఆర్.ఎస్.కుమరేశ్వరన్ ఆదేశాలు మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెండెంట్ ఆర్.వి. ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భీమవరం ఇఎస్‌టిఎఫ్ వారు పాల్లకొల్లు మండలం ఏనుగువానిలంక గ్రామంలో జరిపిన దాడులలో మామిడిశెట్టి శ్రీనివాసరావు అనే గొలుసు దుకాణం నిర్వాహకుడిని అరెస్టు చేశారు. అతని వద్దనుండి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిపై పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ దాడులలో ఎస్ఐ ఎల్.రమాదేవి,సిబ్బంది శ్రీనివాసరావు, సురేష్ రాజు, వై.సీ. శ్రీనివాసరావు, శ్రీకాంత్, సందీప్, గణేష్ పాల్గొన్నారు.

# సంచార జాతులను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం

- వైసీపీ ఎంబీసీ విభాగం
- రాష్ట్ర అధ్యక్షులు పెండ్ర వీరన్న ధ్వజం



భీమవరం,మేజర్ న్యూస్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలల గడిచినా ఇంతవరకు సంచార జాతుల వారిని గుర్తించిన దాఖలాలు లేవని వైసీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. గురువారం భీమవరంలోని పూలే భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఇంతవరకు ఎంబీసీ కార్పొరేషన్ పాలకమండలి సభ్యులను నియమించకపోవడం బాధాకరమని, కూటమి ప్రభుత్వానికి, సంచార జాతుల మీద ఏమాత్రం గౌరవం,బాధ్యత లేదని, ఆ కారణంగానే ఇంతవరకు ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న ఆరోపించారు. మా ప్రియతమ నేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో 56 బీసీ కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. సంచార జాతులను, బీసీ వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత జగన్ కి దక్కుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా గత ఎన్నికల హామీల్లో భాగంగా సంచార జాతులకి,పేద వర్గాలకు, మోస పూరిత హామీలిచ్చి, అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీను కూడా నెరవేర్చలేదని, అందులో భాగంగానే ఎంబీసీ వర్గాలకి స్థానిక సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్ కేటాయిస్తామని, సంచార జాతుల వారికి 200 యూనిట్లు విద్యుత్తు రాయితీ కల్పిస్తామని, దేవాలయ పాలకమండలిలో సభ్యత్వం, మున్సిపల్, కార్పొరేషన్‌లో కో ఆప్షన్ మెంబర్లుగా అవకాశం కల్పిస్తామని, సంచార జాతుల వారికి గుర్తింపు కార్డు మంజూరు చేసి వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు నాయుడు చెప్పారని వీరన్న వివరించారు.కానీ ఇంతవరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టినటువంటి రైతు పోరుబాట అనే మహా ధర్నా కార్యక్రమానికి, శుక్రవారం అన్ని జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు వద్ద జరిగే రైతు పోరుబాట మహా ధర్నాకు అందరూ తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెండ్ర వీరన్న పిలుపునిచ్చారు.

# రైతులకు రెవెన్యూ పరమైన సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



పెదవేగి మేజర్ న్యూస్ :పెదవేగి మండలం వంగూరు గ్రామంలో గురువారం రెవిన్యూ గ్రామ సదస్సు లు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బీబీ రూతు జోసెఫ్ అధ్యక్షత వహించారు.వంగూరు గ్రామంలో రైతులు తమ భూముల కు సంబంధించిన సమస్యలు తెలుపు తూ అర్జీ పెట్టాలని ఆ సమస్యలను నమోదు చేసుకుని వెంటనే పరిష్కరిస్తామని పెదవేగి ఇన్‌చార్జీ తహశీల్దార్ భ్రమరాంబ సూచించారు.ముఖ్యం గా వంగూరు గ్రామంలో పాస్ బుక్‌లు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు తమ వివరాలు తెలియ జేయాలని అన్నారు,సాగులో ఉన్న రైతుల వివరాలురెవిన్యూ రికార్డులలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు,కొంత మంది రైతుల వివరాలు అడంగల్ రికార్డుల్లో కూడా నమోదు కానీ వారు ఉంటే అటువంటి రైతులు అర్జీలు పెట్టు కావాలని సూచించారు,సహజంగా గ్రామాలలో పూర్వం ఒకరి సర్వే నంబరు ఇంకొకరి పాస్ బుక్‌లలో ఉండేవని అటువంటివి ఏమైనా ఉన్నా రైతులు సదస్సు దృష్టికి తెచ్చిపరిష్కరించు కావాలని తహశీల్దార్ భ్రమరాంబ రైతుల కు వివరించారు,ఈ సదస్సులో పెదవేగి మండల సర్వేయర్ మూర్తి, ఇన్చార్జి ఆర్ఐకెబివి సారథి,గ్రామ రెవిన్యూ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# మాజీ సిఎం జగన్‌తో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా భేటీ



తాడేపల్లి/ఏలూరు,మేజర్ న్యూస్ : వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, మండలం వైస్ ఎంపీపీ మట్టా సురేష్, నాయకులు చల్లా గంగాధర్. ఈ సందర్భంగా నియోజకవర్గం లో పార్టీలోని నాయకులు, కార్యకర్తలు అందరు కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, శుక్రవారం జరిగే రైతు సమస్యలపై పార్టీ చేపట్టిన కార్యక్రమం జయప్రదం చేయాలనీ పార్టీ అధినేత సూచించారని సొంగా సందీప్ తెలిపారు.

# అనుమానంతో భార్యను చంపేశాడు



పాలకోడేరు,మేజర్ న్యూస్, అనుమానంతో భార్యను రెక్కలు లేని ఫ్యాన్‌తో కొట్టగా తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది పోలీసుల కథనం ప్రకారం మోగల్లు గ్రామానికి చెందిన చదలవాడ గంగరాజు తన భార్య సుశీల పై అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో బయట నుంచి వచ్చిన భార్యను గంగరాజు ఎక్కడికి వెళ్లావు అని ప్రశ్నించే దగ్గర్లోనే ఉన్న రెక్కలు లేని ఫ్యాన్‌తో తలపై గట్టిగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే ఆమెను భీమవరం వర్మ హాస్పిటల్‌కు,అక్కడినుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది ఇప్పటికే భర్త గంగరాజు పోలీసుల అదుపులో ఉన్నాడు. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.